# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- 2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి దేశం ఈరోజు ఘనంగా నివాళి అర్పించింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం నుంచి జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల మూడు రోజుల పర్యటనకు వెళ్లనున్నారు.
- నక్సలిజం వలన ప్రయోజనం లేదని, శాంతి మాత్రమే అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- చేనేత, చేతివృత్తుల ఉత్పత్తుల ఎగుమతులు త్వరలోనే లక్ష కోట్ల రూపాయల స్థాయికి చేరుకుంటాయని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు.

===================

2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా రాష్ట్రపతి సోషల్ మీడియా పోస్టులో అమరుల త్యాగాన్ని కొనియాడారు. ఉగ్రదాడి సమయంలో కర్తవ్య నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుల ధైర్యం, శౌర్యం, త్యాగానికి యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని, వారి అంకితభావం జాతీయ స్ఫూర్తికి మార్గనిర్దేశనం చేస్తూనే వుంటుందని పేర్కొన్నారు. అమరవీరులకు, వారి కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి అన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ ఎదుర్కొనేందుకు భారత్ దృఢ సంకల్పంతో ఉందని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు.

===================

2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బంది, బాధితులకు దేశం ఈరోజు ఘనంగా నివాళి అర్పించింది. ఉపరాష్ట్రపతి, సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రులు నివాళి అర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోషల్ మీడియా (ఎక్స్) వేదికగా పోస్ట్ చేశారు. "భద్రతా బలగాలు ప్రదర్శించిన అపార ధైర్యం, పరాక్రమం దేశానికి చిరస్మరణీయం" అని పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడి సమయంలో భద్రతా సిబ్బంది కవచంలా నిలబడ్డారని, వారి ధైర్యం, త్యాగం, విధి పట్ల అంకితభావం దేశ చైతన్యంలో శాశ్వతంగా నిలిచి, దేశ సంకల్పాన్ని ప్రేరేపిస్తూనే ఉంటుందని అన్నారు. విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. వీరుల ధైర్యం, ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో నిర్మూలించాలనే దేశ సంకల్పాన్ని మరింత బలపరుస్తోందని పేర్కొన్నారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం నుంచి జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాలకు మూడు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లనున్నారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా. నీనా మల్హోత్రా పర్యటన వివరాలను న్యూఢిల్లీలో ఈరోజు వెల్లడించారు. జోర్డాన్ రాజు కింగ్ అబ్దుల్లా II బిన్ అల్ హుస్సేన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి

నరేంద్రమోదీ ఈ నెల 15 నుంచి 16 వరకు జోర్డాన్‌లో పర్యటిస్తారు. అనంతరం 16, 17 తేదీల్లో ఇథియోపియాలో పర్యటిస్తారు. ఎథియోపియా ప్రధాని డా. అబియ్ అహ్మద్ అలీతో నరేంద్రమోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. తన పర్యటనలో చివరిగా 17, 18 తేదీల్లో నరేంద్రమోదీ ఒమన్‌లో పర్యటిస్తారని ప్రవాస భారతీయ వ్యవహారాల కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

నక్సలిజం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని, శాంతి మాత్రమే అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఈరోజు జరిగిన బస్తర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌ను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. నిషేధిత మావోయిస్టులతో సంబంధం ఉన్నవారు ఆయుధాలు వీడి, జనజీవన స్రవంతిలో కలవాలని అమిత్ షా సూచిస్తూ...

(వాయిస్...35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

చేనేత, చేతివృత్తుల పరిశ్రమ ప్రస్తుతం 50 వేల కోట్ల రూపాయల విలువైన ఎగుమతులను అందిస్తోందని, త్వరలోనే ఇది 1 లక్ష కోట్ల రూపాయల స్థాయికి చేరుకుంటుందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. 'క్రాఫ్టెడ్ ఫర్ ది ఫ్యూచర్' కార్యక్రమం మూడవ ఎడిషన్‌ను న్యూఢిల్లీలో మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత సాంప్రదాయ కళలను అర్థం చేసుకుని, వాటిని ఆకర్షణీయమైన ఉత్పత్తుల రూపంలో ప్రపంచానికి అందిస్తున్నారని చెప్పారు. చేతివృత్తుల ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయడానికి, ప్రభుత్వం 'హబ్ అండ్ స్కోప్' (Hub and Scope) నమూనా కింద 100 మంది కళాకారులతో భాగస్వామ్యం కుదుర్చుకుందని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి సమిష్టి చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. "ఒకే స్వరం, ఒకే సంకల్పం, సమానత్వం కోసం ఒక కొత్త ప్రారంభం" (One Voice, One Resolve, A New Beginning for Equality) అనే నినాదంతో ముందుకు సాగాలని ఆయన అన్ని వర్గాల ప్రజలను కోరారు. గుంటూరులో రాష్ట్ర స్థాయి 'నయీ చేతన 4.0' కార్యక్రమాన్ని, 'జెండర్ రిసోర్స్ సెంటర్' (GRC)ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి మహిళ భద్రతతో, గౌరవంతో జీవించేలా గ్రామీణ భారతదేశాన్ని నిర్మించడమే లక్ష్యమన్నారు. మహిళా సాధికారత సమగ్రమైన, స్థిరమైన అభివృద్ధికి మూలస్తంభమని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

FIFA ప్రపంచకప్ విజేత, అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ 'GOAT ఇండియా టూర్-2025'లో భాగంగా ఈరోజు హైదరాబాద్‌కు చేరుకున్నారు. కోల్‌కతాలో తన తొలి పర్యటన సందర్భంగా జరిగిన గందరగోళం నేపథ్యంలో, మెస్సీని అత్యున్నత స్థాయి భద్రత మధ్య హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో మెస్సీ పర్యటనలో భాగంగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో అత్యంత ఆసక్తికరమైన ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మెస్సీతో పాటు మైదానంలో పాల్గొంటారని భావిస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీలో ఈరోజు ఉదయం నుంచి సగటు వాయు నాణ్యత సూచీ (AQI) పెరుగుతూ వస్తోంది. ఉదయం 10 గంటలకు ఇది 401 గా నమోదైంది. ఈ నేపథ్యంలో, గాలి నాణ్యత క్షీణించిన దృష్ట్యా, ఎన్‌సీఆర్, పరిసర ప్రాంతాలలో వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (CAQM) పరిధిలోని గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (GRAP) ఉపకమిటీ ఈరోజు సమావేశమైంది. ఢిల్లీలో AQI 'తీవ్ర' స్థాయికి చేరడంతో, GRAP స్టేజ్-III కింద ఉన్న అన్ని

చర్యలను ఢిల్లీ-NCRలో తక్షణమే అమలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే అమల్లో ఉన్న స్టేజ్-I, స్టేజ్-II చర్యలకు తోడు ఇవి అమలులోకి వచ్చాయి. NCR కాలుష్య నియంత్రణ బోర్డులు, DPCC సహా సంబంధిత సంస్థలు కఠినంగా ఈ చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. ఈసారి AQI పెరగడానికి ప్రధాన కారణం ఉద్గారాలు కాకుండా వాతావరణ పరిస్థితులేనని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో NDA కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి ఈరోజు సోషల్ మీడియా (ఎక్స్) వేదికగా స్పందిస్తూ... తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎన్డీయేకు లభించిన తీర్పు, కేరళ రాజకీయాల్లో కీలక మలుపుగా అభివర్ణించారు. ఈ విజయం కోసం శ్రమించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. తిరువనంతపురం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ దళాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలను స్వీకరించి, ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేందుకు కట్టుబడి ఉన్నాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. హైదరాబాద్ సమీపంలోని దుండిగల్‌లో ఉన్న వైమానిక దళ అకాడమీలో (AFA) ఈరోజు జరిగిన 216వ కోర్సుకు సంబంధించి సంయుక్త గ్రాడ్యుయేషన్ పరేడ్ (CGP) ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యుద్ధం, యుద్ధ విధానాలు విప్లవాత్మక మార్పులకు లోనవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దృఢమైన సంస్థలు, ప్రజాస్వామ్య స్థిరత్వం, సైనికుల అచంచలమైన వృత్తి నైపుణ్యంపై భారతదేశ బలం ఆధారపడి ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఉత్తర కర్ణాటకలో రేపటి వరకు తీవ్రమైన చలిగాలుల పరిస్థితులు నెలకొంటాయని ఐఎండీ అంచనా వేసింది. అండమాన్ నికోబార్ దీవుల్లో రేపటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త ఎస్. మజుందార్ వెల్లడిస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =